ఓటరు జాబితా తయారీలో బీఎల్ వోలదే కీలక పాత్ర

తహసీల్దార్ కిషన్ సమక్షంలో బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనీలు రాములు, లక్ష్మయ్య

పెద్దేముల్, ఆగస్టు 27: తప్పులులేని ముసాయిదా ఓటరు జాబితాను తయారు చేయడంలో బీఎల్‌వోల పాత్ర కీలకమని పెద్దేముల్ మండల తహసీల్దార్ కె.కిషన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల బీఎల్‌వోలకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఎస్ఆర్-2025)పై శిక్షణ కార్యక్రమాన్ని అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనీలు డి.రాములు, లక్ష్మయ్యల ఆధ్వర్యంలో నిర్వహించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్నవారు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు పట్టుగొమ్మలాంటి వారన్నారు. ఒక సంవత్సరంలో నాలుగు సార్లు ఓటర్ల జాబితాను సవరించి నవీకరించనున్నట్లు తెలిపారు.అందులో జనవరి-1, ఏప్రిల్-1, జులై -1, అక్టోబర్-1 తేదీలు ఉంటాయన్నారు.జనవరి 6, 2025 నాటికి ఓటర్ల ముసాయిదా ఫైనల్ జాబితాను ప్రకటించడం జరుగుతుందని, అక్టోబర్-28,2024 నాడు ఓటర్ల ముసాయిదా జాబితాను వేస్తారని, నవంబర్-28,2024 వరకు అభ్యంతరాలు, డిసెంబర్-24 ,2024 వరకు అభ్యంతరాల పరిష్కారం నిర్వహించి ఫైనల్ లిస్టును రూపొందించి ప్రకటించనున్నట్లు వివరించారు. రాజ్యాంగంలో ఆర్టికల్-324 సార్వత్రిక వయోజన ఓటు హక్కు సూత్రాల ప్రకారం ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించినట్లు తెలిపారు.ఆయా గ్రామాల బీఎల్‌వోలు ప్రధానంగా బుధవారం నుంచి గ్రామాల్లో ఇంటింటికీ తప్పకుండా సర్వేను నిర్వహించి,ఇంటికి మార్కును కూడా చేయాలన్నారు.కొత్త ఓటర్ల వివరాలను సేకరించి,తప్పు,ఒప్పులను గుర్తించి సవరించి,కొత్త వారికి ఫారం-06 అందించి ఆన్‌లైన్‌లో కొత్తగా నమోదు చేయించాలన్నారు. అవసరమున్నచోట కొత్త పోలింగ్ కేంద్రాలవివరాలను స్థానిక ఎమ్మార్వో దృష్టికి తీసురావాలని,పోలింగ్ కేంద్రాల బౌండరీ రిలోకేట్ చేయాలని, మరణించిన, డబుల్‌గా ఎంట్రీ చేసిన, వలస వెళ్లివారి వివరాలను సేకరించి జాబితా నుంచి తొలగించాలన్నారు.బీఎల్‌వోలు 100 శాతం ఏపిక్ కార్డులను పం పిణీ చేయాలని,అక్టోబర్ 18,2024 వరకు వారికి ఇచ్చిన అంశాలను పూర్తి చేసి తప్పులులేని, ఆరోగ్యకరమైన, సమర్థవంతమైన ఖచ్చితమైన ముసాయిదా ఓటరు జాబితాను తయారు చేసే విధంగా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

పూడూరు, ఆగస్టు 27: పూడూరు మండలం దామగుండం అడవిలో కుక్కల దాడితో ఓ జింక మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దామగుండం ఫారెస్ట్‌లో వందల సంఖ్యలో జింకలు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో వేటగాళ్ల బారిన మృతి చెందే జింకలు ప్రస్తుతం కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్నాయి. దామగుండం దేవాలయం వద్ద కోనేరులో నీరు తాగడానికి వచ్చిన జింకను కుక్కలు వెంటాడి చంపినట్లు స్థానికులు తెలిపారు. వేటగాళ్ల, కుక్కలబారి నుంచి జింకలను కాపాడాలని ఫారెస్ట్ అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా ఫలితం లేదని, . ఇప్పటికైనా దామగుండం అడవి లో వన్యప్రాణు లను సంబంధిత అధికారులు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

బిల్లులు రాక బేజారు..

- ఎన్ఆర్ఈజీఎస్ కింద 20 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు
- అప్పులు చేసి నిర్మించిన ప్రజాప్రతినిధులు

దోమ, ఆగస్టు 27 : దోమ మండల పరిధిలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా 2023 సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్ స్కీమ్ కింద 20 గ్రామ పంచాయతీలకు ఒక్కొంటికి రూ. 20 లక్షల చొప్పున కొత్త పంచాయతీ భవనాలు మంజూరు అయ్యాయి. అందులో మోత్కూర్, బుద్లాపూర్, కొత్తపల్లి, గుండాల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు చొరవ చూపి గడువులోగా పంచాయతీ భవనాలను పూర్తి చేసి 2024 జనవరి 26న ప్రారంభం చేశారు. కాని వారికి ఇప్పటికీ బిల్లులు రాక ఆవేదన చెందుతున్నారు. దాదాపూర్, మల్లేపల్లి, మైలారం, శివారెడ్డిపల్లి, కిష్టాపూర్ గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణదశలో ఉండగా, ప్రారంభానికి నోచుకోని గ్రామ పంచాయతీలు పది ఉన్నాయి. అందులో అయినాపూర్, బట్లచందారం, దోర్నాల్‌పల్లి, గూడూరు, పాలేపల్లి, దోమ, దొంగఎన్కెపల్లి, గంజిపల్లి, కొండాయపల్లి, బడెంపల్లి గ్రామాలు ఉన్నాయి. పూర్తి అయిన పంచాయతీ భవనాలకు బిల్లులు చెల్లించకపోవడంతో మిగతా గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి ఎవరు ముందుకు రావడం లేదు అని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు.

అప్పటి ఉన్నతాధికారులు ఎంత త్వరగా పంచాయతీ భవనాలు నిర్మిస్తే అంత త్వరగా బిల్లులు వస్తాయని చెప్పడంతో కొంత మంది ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పనులను పూర్తి చేసినా ఇప్పటికీ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పంచాయితీ భవనాలు నిర్మించాం మాకు త్వరగా బిల్లులు మంజూరు చేయాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరిగితే నిధులు వచ్చినప్పుడు చూస్తామంటూ సమాధానం ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నారని పంచాయతీ భవన నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బుద్లాపూర్‌లో పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన అప్పటి మాజీ సర్పంచ్ మారోనిభాయిపాండు నాయక్ తదితరులు (ఫైల్)

మాటమారుస్తున్నారు..

పంచాయతీ భవనాల బిల్లుల కోసం ఉన్నతాధికారుల దగ్గరకు వెళితే నిధులు వచ్చినప్పుడు చెబుతాం మేము ఏమి చేయలేమని సమాధానం చెప్పి పంపిస్తున్నారు.అప్పులు చేసి భవనాలను సకాలంలో పూర్తి చేశాం.అప్పటి అధికారులు మీరు ఎంత తొందరగా భవనాలను పూర్తి చేస్తే అంత తొందరగా బిల్లులు వస్తాయని చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్నారు. భవనాల కోసం కేటాయించిన నిధులు ఏమైనాయో చెప్పాలి. - రుక్మిణితుల్సీరాం మాజీ ఉప సర్పంచ్ బుద్లాపూర్

ఉన్నతాధికారులకు తెలిపాం..

మండల పరిధిలోని కొత్త గ్రామ పంచాయతీ భవనాలను ఐదు గ్రామాలలో పూర్తి చేశారు. ఈ విషయంలో మా స్థాయిలో ఎంబీలు, ఎఫ్‌టీవోలు కూడా జనరేట్ చేసి ఉన్నతాధికారులకు పంపాం.నిధులు రాగానే వారికి బిల్లులు వస్తాయి. మరి కొన్ని పంచాయతీలలో పనులు కొనసాగుతున్నాయి. వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మిగతా పంచాయతీలలో కొత్త భవనాల నిర్మాణాన్ని త్వరలోనే చేపడతాం - మహేష్‌బాబు ఎంపీడీవో

నిర్లక్ష్యం చేయడం సరికాదు

మండలంలో 20 కొత్త గ్రామ పంచాయితీ భవనాలు మం జూరు కాగా అందులో ఐదు గ్రామ పంచాయితీ భవనాలు పూర్తి అయినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణం పూర్తి చేసిన ప్రజా ప్రతినిధులకు బిల్లులు అందజేయడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదు. ప్రభుత్వాలు ఈ రకమైన వైఖరిని ప్రదర్శిస్తే భవిష్యత్‌లో ప్రభుత్వ పనులు చేయడానికి ఎవరు కూడా ముందుకురారనే విషయం గమనించాలి.
- శ్రీకాంత్‌రావు మాజీ ఉప సర్పంచ్, మోత్కూర్

అన్యాయంగా జైల్లో పెట్టారు..

కవితకు బెయిల్ రావడం సంతోషం : శకుంతలా దేశ్‌పాండే

తాండూరు రూరల్, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విడుదల కావడం సంతోషకరమని తాండూరు నియోజకర్గ బీఆర్ఎస్ మహిళా కన్వీనర్ శకుంతలా దేశ్‌పాండే అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేయని తప్పుకు కవితమ్మను జైల్లో పెట్టడం అన్యాయమని, చివరకు న్యాయమే గెలిచిందని తెలిపారు. తెలంగాణ యావత్తు నేడు పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కొలేక, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రలు పన్నాయని ఆరోపించారు. కవిత కడిగిన ముత్యంలా బయటికి వచ్చిందని తెలిపారు. కక్షపూరితంగా రాజ కీయాలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో రాజకీయ పార్టీలు ఉండాలని, ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడ వద్దని హితువు పలికారు.

అలింకో క్యాంపునకు హాజరైన దివ్యాంగులు

శిబిరానికి హాజరైన దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు.

బొంరాస్‌పేట, ఆగస్టు 27: అలింకో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల నమోదు శిబిరానికి మండలం నుంచి 25 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. వినికిడి లోపం, సెరిబ్రల్ పాలసీతో పాటు వివిధ లోపాలు గల పిల్లలు ఈ శిబిరానికి హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అలింకో సంస్థ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా పరికరాలను అందివ్వనుంది. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ కోఆర్డినేటర్ రజనీ, ఐఈఆర్‌పి టీచర్‌లు రాంశ్రీనివాస్‌బాబు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పని మనిషిలా చేరి.. ఆభరణాలతో ఉడాయించిన మహిళ

హిమాయత్‌నగర్, ఆగస్టు 27: పని మనిషిలా చేరి.. బంగారు ఆభరణాలతో ఉడాయించిన ఓ మహిళను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మంగళవారం పీఎస్ ఆవరణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పై వెంకటేశ్‌తో కలిసి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ కేసు వివరాలను వెల్లడించారు. నారాయణగూడలో నివాసముండే విపిన్ ఇంట్లో పని మనిషిగా కాచిగూడకు చెందిన ఇందిరా (42) నెల రోజుల కిందట చేరింది. విపిన్ తన అమ్మమ్మకు సంబంధించిన ఐదు తులాల మంగళ సూత్రం, నల్ల బీడ్స్ చైన్ 2.5 తులాలు, ఇయర్ రింగ్స్ ఒక తులం ఆభరణాలను బీరువాలో దాచి పెట్టాడు. నమ్మకంగా పని చేస్తున్నట్లు ఇందిరా నటిస్తూ.. ఇంటి యజమాని కళ్లుగప్పి అప్పుడప్పుడు నగదు దొంగిలించింది. అంతే కాకుండా.. ఆ ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు నగలపై ఆమె కన్ను పడింది. యజమాని లేని సమయంలో ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలను దొంగిలించి, ఆ రోజు నుంచి పనికి రావడం మానేసింది. బీరువాలో దాచిన ఆభరణాలను చూడగా కనిపించక పోవడంతో ఆందోళన చెందిన బాధితుడు విపిన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రంగంలోకి దిగిన క్రైం పోలీసులు అనుమానితురాలైన ఇందిరాను అదుపులోకి తీసుకుని విచారించగా.. చేసిన నేరాన్ని ఒప్పుకుంది. దొంగిలించిన ఆభరణాల్లోని మూడు తులాలు చిక్కడపల్లిలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టింది. ఆమె నుంచి ఐదున్నర తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. డీఎస్పై వెంకటేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంజీవ స్వామి ఆలయ భూములను కాపాడండి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దొంగఎన్కెపల్లి గ్రామస్తులు

దోమ, ఆగస్టు 27: మండల పరిధిలోని దొంగఎన్కెపల్లి గ్రామంలోని సంజీవస్వామి ఆలయ భూములు కాపాడాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శేరి రామిరెడ్డి మంగళవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఆలయ భూముల ఆక్రమణలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని వెంటనే ఆయన జిల్లా కలెక్టర్‌కు, దేవాదాయ శాఖ అధికారులకు రెఫర్ చేశారని వారు పేర్కొన్నారు.అనంతరం దొంగ ఎన్కెపల్లి గ్రామ పేరును సంజీవనగర్‌గా మారుస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టారెడ్డి,నాయకులు ఆంజనేయులు, నర్సిములు, నాగేంద్రం, చెన్నయ్య, తిరుపత య్య పాల్గొన్నారు.

అంబేద్కర్ నేషనల్ అవార్డుకు బేగరి రాజు ఎంపిక

పూడూరు, ఆగస్టు 27: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2024కు బేగరి రాజు ఎంపికైనట్లు బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. పూడూరు మండలం కడ్మూర్ గ్రామానికి చెందిన బేగరి రాజు ప్రస్తుతం మాల సంక్షేమ సంఘం వికారాబాద్ జిల్లా ప్రెసిడెంట్‌గా ఉంటూ పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన చేసే సేవ కార్యక్రమాలను గుర్తించి, వచ్చే నెల 5వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరు పతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 8వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవా ర్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తమను బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక చేసిన సెలక్షన్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుట్కా పాకెట్లు స్వాధీనం..కేసు నమోదు

పెద్దేముల్, ఆగష్టు 27 : మండల పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామంలో అనుమానాస్పదంగా సంచులతో తిరుగుతున్న ఓ వ్యక్తి నుంచి గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ కె.గిరి తెలిపారు. గోపాల్‌పూర్ బస్టాండ్‌లో మంగళ వారం బోయిని శ్రీకాంత్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా సంచులతో పోలీసులకు కనబడగా పోలీ సులు విచారించగా అతని వద్ద సంచులలో 11,360 గుట్కా పాకెట్లు లభ్యమయ్యాయి. శ్రీకాంత్ అనే వ్యక్తి తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామం నుంచి పెద్దేముల్ గ్రామానికి తరలిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ విషయమై పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని ఎస్ఐ కె.గిరి తెలిపారు.

రేపు కోస్గిలో జానపద జాతర

బొంరాస్‌పేట, ఆగస్టు 27 : కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో గురువారం తాలుకా స్థాయి జానపద జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య అన్నారు. మంగళవారం బొంరాస్‌పేటలో కళాకారులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటలకు శివాజీ చౌరస్తా నుంచి ఏబీకే ఫంక్షన్ హాల్ వరకు కళారూపాలతో భారీ ర్యాలీ ఉంటుందని తాలుకాలోని అన్ని జానపద కళాకారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లింగయ్య, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు కోస్గి సాయిలు, కేశవులు, శకనప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్‌లో కలిపిన

గ్రామాలను తొలగించాలి

వికారాబాద్, ఆగస్టు 27 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మున్సిపాలిటీలో కలిపిన ఆరు గ్రామాలను మున్సిపల్ నుంచి తొలగించి, గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని మద్గుర చిట్టంపల్లి కౌన్సిలర్ గోపాల్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపాలిటీలో విలీనమైన మద్గుల్ చిట్టంపల్లి, గుడిపల్లి, బూర్గుపల్లి, ధన్నారం, గిరిగెట్‌పల్లి, కొంపల్లి గ్రామాలను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా వ్యవసాయ రైతులుగా ఉన్న గ్రామాలను టెక్నికల్ గా ఆలోచించకుండా మున్సిపల్‌లో కలిపారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో తిరిగి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చారన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మునిసిపల్‌లో కొత్తగాకలిసిన గ్రామాలను గ్రామ పంచాయతీలుగా చేసేందుకు స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ సుముఖంగా ఉన్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, ఆగస్టు 27 : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాపై పూర్తి స్థాయిలో కసరత్తు చేయాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. మంగళ వారం మండల పంచాయతీ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా పంచాయతీల వారీగా ఆయా కార్యదర్శుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు నడుచుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి లో పంచాయతీ కార్యదర్శులు వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయాల్సి ఉందని, కొంత మంది పంచాయతీ కార్యదర్శులు ఇంకా పనులు మొదల పెట్టక పోవడం బాధాకరమన్నారు. నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తూ ఉంటే, ఉన్నతాధికా రులకు సమాధానం చెప్పలేక పోతు న్నామన్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శులు త్వరగా పనులు పూర్తి చేసి, కంప్యూటరైజ్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఎంపీవో ఆనంద్‌రావు ఉన్నారు.

తాండూరులో వ్యభిచార ముఠా గుట్టురట్టు

యాలాల, ఆగస్టు27: తాండూరులో వ్యభిచార ముఠా గుట్టురట్టయింది. తాండూరు పట్టణంలో వ్యభిచార దందా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో మంగళవారం రాత్రి సిద్ధి వినాయక లాడ్జిలో తనిఖీలు నిర్వహించి, వ్యభిచార ముఠాను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో లాడ్జి యజమాని ఇందూర్ నరేందర్, లాడ్జ్ మేనేజర్ పుట్టి రవి తదితరులు ఉన్నారు. వ్యభిచారానికి పాల్పడుతున్న ఐదుగురు మహిళలను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాండూరు ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

నాలాలో కుళ్లిపోయిన మృతదేహం

ఖైరతాబాద్, ఆగస్టు 27: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న నాలాల్లో ఓ మృతదేహాన్ని స్థానికులు చూసి, పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా.. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాలా గోడ పగిలిపోయింది. ఆ వరదలో మృతదేహం కొట్టుకువచ్చినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం సద్దుమనగడానికి ప్రయత్నించిన మామపై దాడిచేసి హత్య చేసిన అల్లుడి సోదరుడికి యావజ్జీవ శిక్ష, ఏడువేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పదో అదనపు జిల్లా న్యాయమూర్తి జయలక్ష్మి తీర్పునిచ్చారు. అదనపు పీపీ కంచర్ల జ్యోతిరెడ్డి కథనం ప్రకారం.. శంకర్‌పల్లి మండలం కాకర్లగుట్ట తండా గ్రామానికి చెందిన పత్లావత్ గోపాల్ తన కూతురు ముత్యాలు వివాహం అదే తండాకు చెందిన రాజుతో జరిపించాడు. కొన్నాళ్ల తరువాత ఇరువురు మధ్య చిన్న చిన్న తగాదాలు మొదలయ్యాయి. 2013, అక్టోబర్15న భార్యాభర్తలు గొడవపడగా.. వారిని సముదాయించడానికి వెళ్లిన గోపాల్‌పై రాజు అన్న అయిన వర్త్య కాల్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఐరన్ పైప్‌తో దాడి చేయగా.. తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవీందర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న మోకిల్లా పోలీసులు దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం ప్రథమ ముద్దాయికి శిక్ష విధిస్తూ.. మిగితా నిందితులపై నేరనిరూపణ కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available,
ఫోన్: 8885731233, 9948033142.
NT- 326218
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చిన్నారి కిడ్నాప్.. మహిళ రిమాండ్

చిన్నారిని అమ్మమ్మకు అప్పగిస్తున్న డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ రఘు, సీఐ, ఎస్సై

కాచిగూడ, ఆగస్టు 27: పాత కక్షలతో ఓ మహిళ చిన్నారిని కిడ్నాప్ చేసింది. ఈ కేసును కాచిగూడ పోలీసులు కొన్ని గంటల్లోనే ఛేదించారు. మంగళవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి. బాలస్వామి, ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు వివరాలను వెల్లడించారు. కామారెడ్డికి చెందిన తిరుపతి భార్య దాసరి మంజుల (29) భిక్షాటన చేస్తున్నది. ఇదిలా ఉండగా.. లచ్చ, మమత దంపతుల ఏడాదిన్న చిన్నారి శ్రీలక్ష్మి సోమవారం అర్ధరాత్రి అమ్మమ్మ పార్వతమ్మతో కలిసి కాచిగూడ రైల్వేస్టేషన్ బస్టాప్‌లో పడుకున్నారు. గతంలో జరిగిన పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని మంజుల, ఆమె మరిది మున్నా కలిసి సోమవారం అర్ధరాత్రి చిన్నారి శ్రీలక్ష్మిని కిడ్నాప్ చేశారు. చిన్నారి కనిపించకపోవడంతో సోమవారం రాత్రి 2 గంటల సమయంలో పార్వతమ్మ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో నిందితులు డబీర్‌పురా రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు ఆచూకీ కనుగొన్నారు. మంగళవారం ఉదయం చాకచక్యంగా వారిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాసరి మంజులను మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అంబర్‌పేట డీఐ మల్లేశ్వరీ, ఎస్సై జి.సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నేరగాళ్లు దోచుకున్నారు..

పోలీసులు తిరిగి ఇప్పించారు..

పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితులు

నేరేడ్‌మెట్, ఆగస్టు 27 : సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి ఓ బాధితుడు పోగొట్టుకున్న నగదును పోలీసులు తిరిగి ఇప్పించారు. ఈ ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గీతానగర్‌లో నివాసి అభిషేక్ మూడు నెలల కిందట సైబర్ నేరగాళ్లు పంపిన లింకులో తన వివరాలు నమోదు చేశాడు. టాస్క్ పూర్తి చేస్తే డబ్బులు వస్తాయని నేరగాళ్లు నమ్మించడంతో ఆశపడ్డాడు. ముందుగా తన ఖాతా నుంచి దశలవారిగా డబ్బులు పంపించాడు. రూ.1,26,752 నగదు పంపించి.. మోసపోయానని తెలుసుకొని నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం 1930లో అతడి వివరాలు నమోదు చేయించి.. నిందితుల బ్యాంక్ ఖాతాలను నిలిపి వేయించారు. ఆ తర్వాత పోలీసులు అన్ని ప్రయత్నాలు చేసి.. బాధితుడు పోగొట్టుకున్న డబ్బును తిరిగి రికవరీ చేసి.. మంగళవారం నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కు